క్లుప్తంగా

రెవెన్యూ సదస్సుకు 16 అర్జీలు



ఫిరంగిపురం: మండలంలోని శిరంగిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అడంగల్, పాస్ పుస్తకాలకు సంబంధించి 15 అర్జీలు, భూమి కొలతలకు సంబంధించి ఒక అర్జీ మొత్తం 16 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటల బీమా వివరాలు వెల్లడి

తాడేపల్లిరూరల్: ఐదు రకాల పంటల బీమాకు సంబంధించి, ఎకరాకు చెల్లించాల్సిన ప్రీమియంలను మండల వ్యవసాయ అధికారి శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పునఃస్థాపిత వాతావరణ ఆధారిత పంట బీమా పథకం (ఆర్ డబ్ల్యూబీసీఐఎస్)కింద రబీకి రైతుల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. మొక్కజొన్నకు రూ.114, జొన్నకు రూ.48, మినుముకు రూ.50, పెసరకు రూ.45, పప్పు శెనగకు రూ.70 బీమా చెల్లించాలని పేర్కొన్నారు. ఈ నెల 15 వరకు గడువని, రైతులు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కుంచనపల్లిలో ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: కుంచనపల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రామ్‌స్నేహ ఎవన్యూ అపార్ట్‌మెంట్‌లో జరుగుతుందని పేర్కొన్నారు. లక్ష్మి కంటి పరీక్ష కేంద్రం కంటి వైద్యులు, డయాబెటిక్ వైద్యుడు నిఖిల్, దంత వైద్యుడు కె.శ్రీకర్ తమ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు 99852 22857 నంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యురాలు శ్వేత సూచించారు. వేములూరిపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 123 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్వేత మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు ఉధృతమయ్యే అవకాశం ఉండటంతో చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. ఎండిన కొబ్బరి బోండాలు, పాత టైర్లు, మంచినీటి కుండలు, గాబులను నాలుగు రోజులకోమారు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్‌ఎం రామిశెట్టి అంథోనిరాణి, హెల్త్ మేల్ అసిస్టెంట్ బాబురావు, ఆశ కార్యకర్తలు సుజాత, పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల పంపిణీ



లక్ష్మీపురం: తోడు నీడు లేక వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వృద్ధులకు ప్రతి ఒక్కరూ సహాయ, సహకారాలు అందించాలని చిన్నం సుబ్బారావు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ న్యాయవాది చిన్నం మురళీధర్ తెలిపారు. స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డులోని సోమేపల్లి కాలనీలోని హ్యాపీ కేర్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చిన్నం సుబ్బారావు మెమోరియల్ ట్రస్ట్ తరపున గురువారం వృద్ధులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ పుట్టిన రోజు, పెళ్లి రోజులకు ప్రతి ఒక్కరూ వద్ధాశ్రయాలలో అన్నదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది గుజ్జుల పాండురంగారెడ్డి, ఆడిటర్లు ఎం.ఎస్.ఖాన్, ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.

పీఎఫ్ రుణాలు మంజూరు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరపాలక సంస్థ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పీఎఫ్ రుణాలను మంజూరు చేయాలని అదనపు కమిషనర్ సీహెచ్. ఓబులేసుకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. హైమారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరు గురువారం నగరపాలకసంస్థ కార్యాలయంలో ఓబులేసును కలిసిన ఎన్‌టీఏ నాయకులు వినతి పత్రం సమర్పించారు. 87 మంది ఉపాధ్యాయులకు సంబంధించిన రూ.నాలుగు కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ రుణాలను మంజూరు చేయాలని కోరారు. 10 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అదనపు కమిషనర్ హామీ ఇచ్చారు. పాఠశాలల్లో తొలగించిన ఉపాధ్యాయేతర, కంటింజెంట్ సిబ్బందిని యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఎన్‌టీఏ నగర శాఖ అధ్యక్షుడు పి. సాయి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి పి. లలితబాబు, గౌరవాధ్యక్షుడు ఎ. వేణుగోపాలరావు, ఆర్థిక కార్యదర్శి కేవీ రాఘవులు, జిల్లా కౌన్సిలర్ కె. వేణుగోపాల్, టి. శ్రీనివాస్, ఎం. బాబూరావు, హరగోపాల్ పాల్గొన్నారు.

టీకా.. ఉండదు డోకా



ఇందిరా నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో టీకా వేస్తున్న వైద్యులు, సిబ్బంది

- ప్రతి బుధ, శనివారాల్లో ఉచిత టీకాలు
- ప్రభుత్వాసుపత్రుల్లో సరిపడా నిల్వలు
- అవగాహన లేమితో ప్రజలు దూరం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న వైద్యులు

మంగళగిరి: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకా తప్పనిసరి. గర్భిణులు, అప్పుడే పుట్టిన చిన్నారులకు ప్రభుత్వం సూచించిన విధంగా టీకాలు వేయిస్తే వ్యాధులు దరిచేరకుండా ఉంటాయి. ఆరోగ్యకరమైన జీవితాలను గడపవచ్చు. అయితే ప్రజలకు టీకాలపై సరైన అవగాహన ఉండటం లేదు. పేదలు సరైన సమయంలో టీకాలు వేయించుకోక అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలను వినియోగించుకుని, అనారోగ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో...

మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు అన్ని పీహెచ్‌సీల్లోప్రతి బుధ, శనివారాల్లో టీకాలు వేస్తారు. గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలలకు ఒకటి, నెల రోజుల తర్వాత మరో టీటీ ఇంజెక్షన్ ఇస్తారు. వీటితో ఐరన్ ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్లు ఇస్తారు. అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్ బీ డోసు వేయాలి. వీటి వల్ల పోలియో, పచ్చ కామెర్ల వ్యాధులు నుంచి రక్షణ లభిస్తుంది. 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి. 6, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి. 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటివల్ల కోరింత దగ్గు, కంఠ సర్పి, ధనుర్వాతం, మెదడవాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.

టీకాలు తప్పనిసరి

9 నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్ ఏ చుక్కలు వేయించాలి. 9 నెలల నుంచి ఐదేళ్ల వరకు ప్రతి నెలకు ఒకసారి విటమిన్ ఏ చుక్కలు మొత్తం 9 డోసులు వేయించాలి. 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు డీపీటీ, మీజిల్స్, విటమిన్ ఏ టీకాలు వేయించాలి. ఐదేళ్లు పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి. 10, 16 సంవత్సరాలు పూర్తయితే టెట్నాస్(టీటీ) వేయించాలి. ఇందిరానగర్ పీహెచ్‌సీ డాక్టర్ పి.అనూష మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. దీంతో ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులు అనారోగ్యం బారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. ప్రజలకు టీకాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డకు ఘన నివాళి



నిమ్మగడ్డ రామ్మోహనరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ రామ్మోహనరావు వర్ధంతిని గురువారం కృష్ణాయపాలెంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి రామ్మోహనరావు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉన్నత విద్యను అభ్యసించి ప్రజా సేవకే అంకితమైన ధన్యజీవి నిమ్మగడ్డ అని కొనియాడారు. నిజాయితీగా, నిస్వార్థ ప్రజా సేవకుడిగా, పేదలకు, రైతులకు, కార్మికులకు కొండంత అండగా నిలిచిన వ్యక్తి రామ్మోహనరావు అన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మగడ్డ రామ్మోహనరావు సతీమణి లక్ష్మీ సామ్రాజ్యం, సోదరుడు మురళీకృష్ణ, కుమారులు బాల ప్రకాష్, దినకర్, కొరిటాల రాంబాబు, నాయకులు ఎం. భాగ్యరాజు, ఎస్.రామరాజు, షేక్ జాని, అత్తలూరి వీర వెంకయ్య, నాగేశ్వరరావు, శ్రీరామమూర్తి, రాధిక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులకు గాయాలు



తీవ్రంగా గాయపడిన రాజు

తాడేపల్లిరూరల్: ఉండవల్లి అమరావతి రోడ్డు, గుంటూరు చానల్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. సేకరించిన వివరాల మేరకు.. తుళ్ళూరు మండలం, ఉద్దండరాయునిపాలేనికి చెందిన సౌజన్య కుమార్, తండ్రి రాజు ద్విచక్ర వాహనంపై విజయవాడ వెళ్తున్నారు. ఉండవల్లి గుంటూరు చానల్ సమీపానికి వచ్చే సరికి ఎదురుగా పైపుల లోడ్‌తో వస్తున్న ఆటో అతి వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సౌజన్య కుమార్‌కు కుడికాలు మణికట్టు పూర్తిగా విరిగిపోయింది. వెనుక కూర్చున్న తండ్రి రాజుకు మోకాలు వద్ద గాయమైంది. ఇద్దరూ కిందపడడంతో రాజుకు కాలితో పాటు పలు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన తండ్రీకొడుకులను మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

కార్మికుల పోరాటం విజయవంతం కావాలి



కార్మికులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న పోరాటం విజయవంతం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు ఆకాంక్షించారు. గురువారం కార్మికుల రిలే దీక్షలకు సంఘీభావం తెలియజేశారు. యూనియన్ నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వరరావు, కొట్టే కరుణాకర్‌రావు, కె.మేరి, వి.శాస్త్రికి పూలమాలలు వేసి దీక్షలో కూర్చోబెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు చేస్తున్న దీక్షలకు మద్దతు తెలియజేస్తున్నామని ప్రకటించారు. అవసరమైతే పోరాటాన్ని రాష్ట్ర స్థాయిలో ఉధృతం చేస్తామని, భూములు అమ్మి విక్రయించినా కార్మికులకు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోర్టు తీర్పులను ధిక్కరించి కార్మికులు వేసుకున్న గుడిసెలను అక్రమంగా కూల్చివేసిన ఎంటీఎంసీ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. రైతు సంఘం నాయకులు జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ 30 సంవత్సరాలకు పైబడి సుదీర్ఘంగా సాగుతున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలకు ఆశ వర్కర్ సీనియర్ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె. వెంకమ్మ, ఇరిగేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వి. రాఘవయ్య, ఆవాజ్ నాయకులు ఎస్ఎం బాషా, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో ప్రసూన

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రసూన పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కిషోర వికాసంపై సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ బాల బాలికలు గౌరవంగా సమాజంలో సరైన మార్గంలో జీవించేలా చేయాలన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల బాలబాలికల ఆరోగ్యం, పోషణ, విద్య, సామాజిక భద్రత, బాల్య వివాహాల అనర్థాలను గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. దీనికోసం గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో రుతుక్రమ పరిశుభ్రత, రక్తహీనత, పౌష్టికాహారం, అక్రమ రవాణా, పీవోసీఎస్‌వో చట్టం, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, చంద్రశేఖరరెడ్డి, రూతమ్మ, వెంకట్, వెంకటరమణ, మహాలక్ష్మీ పాల్గొన్నారు.

నేడు సమస్యలపై వైఎస్సార్ సీపీ ధర్నా

మంగళగిరి: రైతు సమస్యలపై వైఎస్సార్ సీపీ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. శుక్రవారం ధర్నాలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు జీజీహెచ్‌లో భవన నిర్మాణానికి శంకుస్థాపన

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో రూ. 10 కోట్లతో డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్‌స్పెషాలిటీ భవనంపై మరో రెండంస్తులు నిర్మించేందుకు ఆసుపత్రి అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈనెల 15న ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికాబద్ధ సన్నద్ధత

డీఈవీ సీవీ రేణుక

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. గురువారం పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈవో సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-1) పరీక్షలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుని, సబ్జెక్టుల వారీగా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే క్రమంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, పరీక్ష ముగిసిన తరువాత ప్రశ్నాపత్రాలు దిద్ది విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. విద్యార్థులు రాసిన తప్పులను సరిచేసి ప్రశ్నపత్రాలు వారితో చదవించాలని సూచించారు. డీఈవో వెంట హెచ్‌ఎం వసుంధర, ఉపాధ్యాయులు ఉన్నారు.

రేషన్ అందక ప్రజల ఇక్కట్లు

రేషన్ డీలర్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని రేషన్ ఎండీయూ వాహనదారుల అలసత్వం వల్ల సకాలంలో రేషన్ అందక పేద ప్రజలు ఇక్కట్లకు గురి అవుతున్నారు. గురువారం వరకు ఎంటీఎంసీ వ్యాప్తంగా రేషన్ సరుకులు 40 శాతం మాత్రమే ఎండీయూ వాహనాల ద్వారా అందించినట్లు రేషన్ డీలర్లు పలువురు తెలియజేశారు. ప్రతి నెలా 1 నుంచి 17వ తేదీ వరకు పూర్తిస్థాయిలో రేషన్ పంపిణీ చేయాల్సి ఉంది. అలాంటిది ఇప్పటి వరకు 40 శాతం వరకు కూడా పూర్తి కాలేదు. సేకరించిన వివరాల ప్రకారం తాడేపల్లి మండల రూరల్ పరిధిలో పలు ప్రాంతాల్లో గత రెండు నెలల నుంచి రేషన్ అందడం లేదు. ఇదేమని రేషన్ డీలర్లు అడిగితే వారిపై వాహనదారులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. ఎండీయూ వాహన యజమానులు దౌర్జన్యాలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయంలో కలుగజేసుకుని రేషన్ బియ్యం, ఇతర సరుకులు పక్కదారి పట్టకుండా అధికారులు చర్యలు తీసుకుంటే తప్ప ప్రభుత్వ లక్ష్యం నెరవేరదని పలువురు లబ్ధిదారులు అంటున్నారు.

సహకారంతోనే బాలల హక్కుల సాధన



మాట్లాడుతున్న చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ నాగమణి

తాళ్ళాయపాలెం(తాడికొండ): బాలల హక్కుల సాధనలో తల్లిదండ్రులతో పాటు ప్రభుత్వం పూర్తి సహకారం అందించినప్పుడే ఆశించిన రీతిలో చిన్నారులు అభివృద్ధి చెందుతారని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు అత్తోట పోతురాజు, ఎన్.నాగమణి అన్నారు. ప్రాజెక్టు ఆధ్వర్యంలో చిన్నారుల భద్రత, హింస నిరోధక మార్గాలపై తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో నిర్వహించిన అవగాహనా సదస్సుకు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. బాల్యం అమూల్యమైనదని, కానీ నేటి తరం చిన్నారులు ఎక్కువగా టీవీ, సెల్‌ఫోన్‌లలో బిజీబిజీగా గడుపుతున్నారన్నారు. ఇది వారి ఆరోగ్యంపై చాలా ప్రభావం చూపుతుందన్నారు. బాల్యాన్ని చిదిమేసే ఇలాంటి ఘటనలు ఎక్కడైనా జరిగితే హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 100కు తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెపర్డ్ సంస్థ సిబ్బంది బి విజయలక్ష్మి, జె ఇశ్రాయేల్ పలువురు గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

మండలంలో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

రూ 6.65 లక్షల అపరాధ రుసుం విధింపు




కేసుల వివరాలు వెల్లడిస్తున్న సీఆర్డీపీ ఎస్ఈ సుబ్రహ్మణ్యం

మేడికొండూరు: మండలంలో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు నిర్వహించినట్లు సీఆర్‌డీపీ సూపరింటెండెంట్ ఇంజినీరు పి.సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. మొత్తం 102 సర్వీస్‌లపై కేసులు నమోదు చేసి, రూ 6.65 లక్షల అపరాధ రుసుం విధించినట్లు వెల్లడించారు. గుంటూరు టౌన్- 2 ఏడీఈ సీహెచ్ రమేష్ ఆధ్వర్యంలో విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాలు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. మండలంలోని 16 గ్రామాలలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. 60 మంది సిబ్బంది, 30 బృందాలుగా విడిపోయి 2,188 సర్వీస్‌లను తనిఖీ చేసినట్లు చెప్పారు. వాటిలో 98 సర్వీసులకు ఓవర్ లోడ్ లోడ్ కింద రూ. 5,13,500లు అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యం గుర్తించి మూడు సర్వీసులకు రూ.1.50 లక్షలు అపరాధ రుసుం వేశారు. తనిఖీలలో గుంటూరు రూరల్ ఏడీఈ గురునాథం, చిలకలూరిపేట ఏడీఈ ఆర్.అశోక్ కుమార్, గుంటూరు టౌన్ 2 డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారంతో సామాన్యుడు సతమతం

లక్ష్మీపురం: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపుతూ స్వర్ణాంధ్ర నిర్మాణం అని చెప్పడం హాస్యాస్పదమని సీపీఎం నగర కమిటీ సభ్యులు టి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. విద్యుత్ చార్జీల పెంపుదలను వివరిస్తూ సంగడిగుంట ఏరియా పరిధిలోని బావాజీ నగర్ ఏరియాలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు, నారా లోకేష్ విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీనిచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూ ఆఫ్, సర్దుబాటు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో రూ.17 వేల కోట్లు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపడం దారుణమని ఖండించారు. విద్యుత్ చార్జీలను, స్మార్ట్ మీటర్లను ఇప్పటికైనా ఉపసంహరించకపోతే రాబోయే కాలంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలతో కలసి విద్యుత్ భారాలపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు అబ్దుల్ రషీద్, మురళీకృష్ణ, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు క్రీడలు తప్పనిసరి



విజేతలతో ఆర్ఐవో జుబేర్, ఫ్రాన్సిస్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ స్థాయిలో విద్యార్థులకు క్రీడలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆర్ఐవో జీకే జుబేర్ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ-జేఈఈ, నీట్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్ఐవో జుబేర్ మాట్లాడుతూ ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు క్రీడల నిర్వహణపై యాజమాన్యాలు ఆసక్తి చూపడం లేదని తెలిపారు. శారీరక, మానసిక ఉల్లాసం, ఉత్సాహాన్ని పెంపొందించడంలో క్రీడలు దోహదం చేస్తాయన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్. ఫ్రాన్సిస్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏటా విధిగా స్పోర్ట్స్‌మీట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత ఏడాది జూనియర్ విద్యార్థులకు సైతం క్రీడా పోటీలను ప్రారంభించామని తెలిపారు. డైరెక్టర్ ఎస్. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జోసఫ్‌రెడ్డి, సీఈవో సన్నీ హెన్‌డ్రిక్స్, ఏజీఎం ఏడుకొండలు, డీజీఎం శేషగిరిబాబు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 131 మంది విద్యార్థినుల ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో ఉన్న జవహర్ విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 131 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తెలిపారు. నియో లింక్ టెలీ కమ్యూనికేషన్స్‌లో అసెంబ్లింగ్ ఆపరేటర్ పోస్టు కోసం నిర్వహించిన మౌఖిక పరీక్షల్లో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 58 మంది, హీరో మోటోకార్ప్స్‌లో ప్రొడక్షన్ ఆపరేటర్ పోస్టుకు 73 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో హీరో మోటో కార్ప్స్ హెచ్‌ఆర్ మేనేజర్ సురేష్, జేకేసీ సమన్వయకర్త అపర్ణా సీతారామ్, జేకేసీ మెంటార్లు యూనిస్‌ఖాన్, అపర్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా



నెహ్రూనగర్: నగరానికి తాగునీటిని సరఫరా చేసే మేజర్ పైప్‌లైన్‌కు తక్కెళ్లపాడులో ఏర్పడిన లీకును నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు షెడ్యూల్‌కి ముందే బుధవారం అర్ధరాత్రికి పూర్తి చేశారు. గురువారం సాయంత్రం పాక్షికంగా, శుక్రవారం ఉదయం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా జరుగుతుందని నగర కమిషనర్ పులి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కెళ్లపాడుతో పాటు వివిధ రిజర్వాయర్ల పరిధిలో లీకుల మరమ్మతులను నిర్దేశిత షెడ్యూల్ కంటే ముందుగానే పూర్తి చేసి ప్రజలకు నీటి సమస్య లేకుండా చేసినట్లు పేర్కొన్నారు.

వైద్య కళాశాలకు వాటర్ కూలర్ వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల విద్యార్థుల రీడింగ్ రూంలో గురువారం 1999 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ నరేష్ విరాళంగా అందజేసిన వాటర్ కూలర్‌ను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందచారీ వాటర్ కూలర్ వితరణ చేసిన డాక్టర్ నరేష్‌ను అభినందించారు.. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, 1999 బ్యాచ్‌కు చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీమద్భాగవతం ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తోన్న శ్రీమద్భాగవతం ధారావాహిక ప్రవచనాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు బ్రహ్మశ్రీ మల్లాది కైలాసనాథ్ ప్రసంగిస్తూ శ్రీమద్భాగవతం హిందూ మతం, ధర్మశాస్త్రం, సంప్రదాయం, సాహిత్యం, ఆలోచనా విధానంలో ముఖ్యమైన ప్రభావం కలిగిన ఒక పురాణమని చెప్పారు. భగవంతుని కథగా, భగవంతునికి శరణాగతులైన భక్తుల కథగా భక్తి యోగాన్ని చాటి చెప్పే ప్రాచీన గాథ అని పేర్కొన్నారు. ప్రధానంగా విష్ణువు, కృష్ణుడు, ఇతర భాగవత అవతారాలను ఈ గ్రంథంలో చెప్పారని వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య పాల్గొన్నారు. అనంతరం మల్లాది కైలాసనాథ్‌ను సత్కరించారు.